

# ప్రకృతి సేద్యానికి వాసన్ వరం..

**హరిత విప్లవం పుణ్యమాని రైతులు సాగులో తక్కువ శ్రమకు అలవాటు పడ్డారు... వీలైనంత స్వల్ప కష్టంతో సేద్యం చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారు... ఇటీవలకాలంలో ఏటా పెరుగుతున్న పెట్టుబడులు, పంట ఉత్పత్తుల్లో రసాయనాల శాతం హెచ్చిన తరుణంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయాలనే ఆసక్తి ఉన్నా... జీవ ఉత్ప్రేరకాలు తయారీ కష్టమనే సాకుతో వెనుకంజ వేస్తున్నారు. ఈ సమస్యల్ని అధికమించి, సేంద్రీయ సేద్యాన్ని రైతులకు చేరువ చేసేందుకు వాసన్ ఆలోచన చేసింది.. దానికి ప్రతిరూపమే డీజే (ద్రవ జీవామృతం) యూనిట్ల ఏర్పాటు... ఎటువంటి శ్రమ చేయకుండా యంత్రాల సాయంతో అవసరమైన మిశ్రమాలతో ఒకేసారి వందల లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేసి, రైతులు నేరుగా పొలంలో వేసుకునే విధంగా సిద్ధం చేసి అందిస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 90 శాతం సంస్థ, మిగిలిన 10శాతం రైతు భాగస్వామ్యంతో పూర్తి చేస్తోంది. వీటి నిర్వహణ భాధ్యత రైతులకు అప్పగించి, వీలైనంత ఎక్కువ మంది వీటిని వినియోగించుకుని, రాబడి పెంచుకునేలా ప్రోత్సహిస్తోంది. ఇతర రైతులు సైతం ప్రకృతి సాగుకు మొగ్గుచూపేలా చర్యలు తీసుకుంటోంది.**

- **రైతులకు చేరువగా జీవ ఉత్ప్రేరకాలు**
- **ప్రధాన గ్రామాల్లో డీజే యూనిట్లు ఏర్పాటు**
- **వీటి సౌలభ్యంతో పెరుగుతున్న విస్తీర్ణం**
- **మరింత విస్తరించేందుకు సన్నాహాలు**

ప్రకృతి పద్ధతిలో సాగుకు ప్రధానంగా ఘన, ద్రవ జీవామృతంతో పాటు పంటకు ఆశించిన తెగుళ్లను బట్టి నీమాస్త్రం, అగ్నాస్త్రం వంటి వివిధ రకాలైన కషాయాలను వాడుతుంటారు. దీనిలో ప్రధానంగా ఏ పంట సాగు చేసినా ఘన, ద్రవ జీవామృతాలు వాడకం తప్పనిసరి. వీటిలో ఘన జీవామృతాన్ని పంట ప్రారంభంలో వినియోగిస్తుండగా, ద్రవ జీవామృతంను పంటకాలం ముగిసే సరికి నాలుగైదు దఫాలుగా వాడుతుంటారు. ఆహార, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు, జీడిమామిడితో పాటు అన్ని రకాల పండ్ల తోటలకు ద్రవ జీవామృతాన్ని వినియోగించవచ్చు. ఈ విధంగా ప్రకృతి సాగులో ద్రవ జీవామృతం ప్రధాన భూమిక పోషిస్తుంటుంది. దీనిలో కోట్ల సూక్ష్మపోషకాలుంటాయి. వీటిని చల్లిన భూమిలో వానపాములు చైతన్యవంతమై అన్ని రకాల పోషకాలను పంటలకు అందించేలా దోహదం చేస్తాయి. దీనివల్ల పంటకు అదనపు బలం చేకూరి, దిగుబడులు పెరుగుతాయి.

దీనిని తయారు చేసేందుకు ఆవుపేడ, ఆవు మూత్రం, బెల్లం, పిండి, పుట్టమట్టి వంటి పదార్థాలకు వాడాల్సి ఉంటుంది. దీనికి ప్రధానంగా దేశీయ ఆవు నుంచి పేడ, మూత్రం సేకరించాల్సి ఉంది. పేడ కంటే మూత్రం సేకరించడం రైతులకు పెద్ద సమస్యగా అవుతోంది. దీనిని పూర్తిస్థాయిలో సేకరించాలంటే ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసి, కింద సిమెంటుతో చదును చేయించాల్సి ఉంటుంది. దీనిని ఆదివాసీ రైతులంతా సిద్ధం చేసుకునేందుకు ఆర్థిక సమస్య



అడ్డంకిగా మారింది. దీంతో పాటు పేడ, మూత్రం, పిండి, బెల్లం, పుట్టమట్టి, అవసరమైనంత నీటిని కలిపి ద్రవ జీవామృతం తయారు చేసినా, వడపోత చేస్తే కానీ స్ప్రేయర్లతో పిచికారీ చేసేందుకు వీలుకాదు. ఈ విధంగా దీని తయారీకి అవసరమైన పదార్థాల సేకరణ నుంచి పంటకు అందించే వరకు వివిధ దశల్లో రైతులు శ్రమ చేయాల్సి వస్తోంది. ఎరువులు అందుబాటులోకి వచ్చిన దగ్గర్నుంచి తక్కువ కష్టానికి అలవాటు పడ్డ రైతులు వీటి తయారీలో శ్రమ చేయలేక ప్రకృతి పద్ధతిలో సాగుకు ముందుకు రావడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన వాసన్ సంస్థ ద్రవ జీవామృతం తయారీలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. దీనికి అనుగుణంగా యంత్ర పద్ధతిలో తయారు చేసేందుకు ఏర్పాట్లు చేసింది.





వాసన్ సంస్థ ప్రథమంగా డి.గొందూరు క్లస్టరు, గుర్రంపనుకు గ్రామంలో రెండేళ్ల క్రితం ద్రవ జీవామృతం యూనిట్‌ను ఏర్పాటు చేసింది. దీని తయారీకి ఏర్పాటు చేసిన ట్యాంకుకు నీరు, ఆవు మూత్రం అందించేందుకు, ఈ పదార్థాలన్నీ కలిపేందుకు యంత్రాలను ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన విద్యుత్ కోసం సోలార్ పలకను అనుసంధానం చేశారు. అదేవిధంగా ఈ మిశ్రమాన్ని వడపోసేందుకు ప్రత్యేక మెస్‌లు ఏర్పాటు చేశారు. ఈ విధంగా కేవలం ఒక రైతు కాస్త శ్రమ చేసి, సోలార్ విద్యుత్ సరఫరాతో వందల ఎకరాలకు సరిపడా ద్రవ జీవామృతం తయారు చేసేలా చర్యలు తీసుకుంది. దీని నిర్మాణానికి లక్షా 45వేలు వ్యయం చేసింది. ఈ గ్రామంలో 16 మంది రైతులున్నారు. ఈ రైతులందరికీ ముందుగా పశువుల షెడ్లను నిర్మాణం చేపట్టింది. వీటికి ఒక్కో దానికి 50 శాతం నిధులు మెటీరియల్ రూపంలో సంస్థ భరించింది. ఈ షెడ్ల నుంచి ఆవు మూత్రం నేరుగా ట్యాంకునకు చేరి, నిల్వ చేసేందుకు వీలుగా పైపులు ఏర్పాటు చేసింది. ఈ పైపుల వల్ల పశువులు ఎప్పుడు వేసిన మూత్రం వెంటనే ట్యాంకులోకి వచ్చి చేరుతుంది. అక్కణ్నుంచి నేరుగా ద్రవ జీవామృతం తయారు చేసే ట్యాంకులోకి చేరేలా మోటారును అమర్చారు. దీంతో పాటు దీనికి సరిపడా నీటిని అందించేందుకు సమీపంలో ఉన్న బావి నుంచి మరో మోటారు వేశారు. ఈ ట్యాంకులో కేవలం పేడ, బెల్లం, పిండి మాత్రమే రైతు వేయాల్సి ఉంటుంది. వీటిని వేసిన తరువాత మోటారు ద్వారా అన్ని పదార్థాలను కలిపి వడబోసి, వాడుకునేందుకు సిద్ధం చేసిన ద్రవ జీవామృతాన్ని మరో ట్యాంకునకు పంపుతుంది. దీని నిర్వహణకు మరలా సంస్థపై ఆధారపడకుండా అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గుర్రంపనుకు నీటి సంఘం ఏర్పాటు చేసింది. ద్ర.జీ తీసుకున్న రైతుల నుంచి నామ మాత్రపు రుసుం వసూలు చేసి, సంఘంలో జమ చేసేలా షరతులు విధించింది. పశువుల మూత్రం ఇచ్చిన రైతుల నుంచి లీటరకు రూ.3లు, ఇతరులకు రూ.5లు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ఇప్పటివరకు రూ. 16వేలు సంఘంలో జమచేశారు. దీని ఆధారంగా గ్రామంలో 16 మంది రైతులకు చెందిన 32.48 ఎకరాల పల్లపు, 10.04 ఎకరాల్లో పీఎండీఎస్ విధానంలో వరి, రాగులు, చామదుంప, పసుపు, పిప్పళ్లు, దుంపలు, ఆవాలు, ఆపరాలు, గుమ్మడితో పాటు అన్ని రకాల కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ ద్రవ జీవామృతంతో వరి పంట సాగు చేసిన కూడా లక్ష్మయ్యకు పంట దిగుబడులు 20 శాతం పెరిగాయి. నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి వస్తున్నాయి. కూడా కామరాజు ఇదే విధంగా లబ్ధిపొందుతున్నాడు. వీరితో పాటు చుట్టుపక్కల 120 మంది రైతులు దీనిని కేన్‌లతో తీసుకెళ్లి పంటలకు పిచికారీ చేస్తున్నారు...

దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, గొప్పుల వలసలో ఇదే తరహాలో 10 శాతం రైతు భాగస్వామ్యంతో రూ. 1.45 లక్షలతో రెండో ద్రవ జీవామృతం యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌తో గొప్పుల వలసతో పాటు చుట్టుపక్కల కరకవలస, పనస వలస, ఒడియ వలస, కాగువలస గ్రామాలకు చెందిన రైతులు దీనిని వినియోగించు కుంటున్నారు. ఈ గ్రామంలో 22 మంది రైతులకు 50శాతం సంస్థ ఆర్థిక సాయంతో పశువుల షెడ్లు నిర్మాణం చేసి, వాటి నుంచి మూత్రాన్ని సేకరిస్తున్నారు. దాదాపుగా వంద మంది రైతులు దీని నుంచి ప్రయోజనం పొందుతున్నారు. మూత్రం అందించే రైతుల నుంచి లీటరుకు రూ.3లు, ఇతరుల నుంచి రూ. 3.50లు వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 800 లీటర్లు వినియోగించుకున్నారు. ఈ విధంగా సమకూరిన రూ. 2,400ల నిధులను థింసా రైతు ఉత్పత్తిదారుల సంఘంలో జమ చేశారు. దాదాపుగా 200 ఎకరాల్లో ఈ ద్రవ జీవామృతం వాడుకుని గులిరాగి, సామలు,కొర్రలు, చిన సామలు, నాగదుంప, చీమ దుంప, అల్లం, పసుపు, టమోటా, ముల్లంగి, బెండ, క్యారెట్, బీన్స్, కాలిఫ్లవర్, క్యాబేజీ, చిక్కుడు, కాకిజొన్న, వలిసెలు, మొక్కజొన్న, పిప్పళ్లు, కాఫీ మరియు మిరియాలు సాగు చేస్తున్నారు.

మరో ద్రవ జీవామృతం యూనిట్‌ను దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, కిల్లోగుడలో ఏర్పాటు చేశారు. దీనికి 10 శాతం రైతు భాగస్వామ్యంతో రూ. 1.47 లక్షల వ్యయం చేశారు. గ్రామంలో 14 మందికి 50శాతం ఆర్థిక సాయంతో పశువుల షెడ్లు నిర్మాణం చేశారు. దీని ఆధారంగా గ్రామంలో 14 మంది రైతులు 94 ఎకరాల్లో వేరుశెనగ, అల్లం, కందులు, సామలు, రాగులు, వరి, మిరియాలు, కాఫీ, పసుపు, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యారెట్, బీన్స్, వంకాయ, మిరప, టమోటా, ముల్లంగి, చారుదుంప, తీయదుంప, కర్రపెండ్లం సాగు చేస్తున్నారు. నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఈ యూనిట్ నుంచి ద్రవ జీవామృతం తీసుకున్న కిల్లోగుడ రైతులకు ఉచితంగానూ, ఇతరులకు లీటరుకు రూ. 3ల చొప్పున వసూలు చేసేందుకు నిర్ణయించారు.

ఈ విధంగా లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసి, ప్రకృతి విధానంలో సాగు చేసే రైతులు విరివిగా వాడుకునేందుకు అందుబాటులో ఉంచారు. దీనివల్ల అధిక శాతం మంది తమ పంటలకు ఎక్కువగా వినియోగించుకుని, ఆదాయ పరంగా లాభపడుతున్నారు. దీనిని ప్రత్యక్షంగా చూసిన రైతులు కొత్తగా ప్రకృతి సాగు చేపట్టేందుకు ముందుకు వస్తున్నారు. క్రమేపీ దీనికి డిమాండ్ పెరిగితే మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేలా వాసన్ సంస్థ ప్రణాళికలు చేస్తోంది.

# వర్షాధార రైతులకు ఆపన్నహస్తం

**మన్యంలో సాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేయడమంటే మహాయజ్ఞమే... అయినా చేపట్టేందుకు ముందుకు వచ్చింది వాసన్ సంస్థ... ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచడానికి కేవలం అవగాహన మాత్రమే సరిపోదని గ్రహించింది. సేద్యానికి సంబంధించిన అవసరాలు తీరిస్తే, దానికి అనుగుణంగా ఈ పద్ధతి విస్తరిస్తుందని భావించింది.. దీనిలో భాగంగా గ్రామాల్లో వృధాగా పోతున్న నీటి వనరులను గుర్తించి, వాటిని రైతుల చెంతకు అందిస్తే తిరుగుండదని భావించింది.. దానికి అనుగుణంగా నిర్వహణ భారంలేని సోలార్ వ్యవస్థలతో నీటిపారుదల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది... పూర్తయినచోట ఇంతవరకు ఖాళీగా ఉన్న భూముల్లో సాగు ప్రారంభమయ్యింది.. దీనికి ప్రకృతి విధానాన్ని అనుసరిస్తూ అదనపు ఆదాయం సాధించి, రైతులు లాభపడుతున్నారు.. దీన్ని ఆదర్శంగా తీసుకుని ఈ ప్రాజెక్టులను మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది...**

- సాగునీటి సదుపాయం కల్పించిన వాసన్ సంస్థ
- ఏడాది పాటు పంటలు పండించే దిశగా కార్యాచరణ
- పదుల సంఖ్యలో రైతులకు అదనపు ఆదాయం
- ఏజెన్సీ వ్యాప్తంగా విస్తరించేందుకు సన్నాహాలు



ఏజెన్సీలో నీటి వనరులను ఆనుకుని ఉన్న భూములు తప్ప, మిగిలినవన్నీ వర్షాధారమే.. కొండ గెడ్డలను ఆనుకుని ఉన్న భూములకే ఎక్కువ రోజులు నీరందుతుంది. అందువల్ల రైతులు ఈ భూముల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. ఇలాంటి భూములు ఏజెన్సీ విస్తీర్ణంలో 30 శాతం వరకు ఉంటాయి. ఇక మిగిలిన 70శాతం భూములు వర్షాధారమే.. అందువల్ల తొలకరిలో పడిన వర్షాలకు సాగు చేయడం, మిగిలిన సమయాల్లో ఖాళీగా వదిలేయడం చేస్తున్నారు.. దీనివల్ల రబీలో పంటలు సాగుకు నోచుకోవడం లేదు. ఏజెన్సీలోని కొన్ని ప్రాంతాల్లో నిరంతరం ప్రవహించే కొండ గెడ్డలుంటాయి. ఇవి సాగు భూములకు చాలా లోతున ప్రవహిస్తుంటాయి. అందువల్ల ఆ నీటిని తెచ్చుకుని సాగు చేయాలంటే వారు లక్షల్లో ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. అంత స్థోమత లేకపోవడంతో ముందుకు వెళ్లలేక పోతున్నారు. ఈ విధంగా ఖాళీగా ఉన్న భూములపై సూర్యరశ్మి నేరుగా పడటం వల్ల దానిలో సూక్ష్మ పోషకాలు నశించి, నిస్సారంగా మారుతున్నాయి. దీనికంతటికీ కారణం తగినంత నీటి సదుపాయం లేకపోవడమే.. ఈ విషయాన్ని గుర్తించిన వాసన్ సంస్థ వీలైనన్ని ఎక్కువ చోట్ల సాగునీటి సదుపాయం కల్పించి, వందల సంఖ్యలో రైతులు ప్రయోజనం చేకూర్చేలా కార్యాచరణ చేసింది. దీనికి అనుగుణంగా ఇప్పటికే మూడు చోట్ల సోలార్‌తో మోటార్లు ఏర్పాటు చేసి, పైపులైన్లు ద్వారా నేరుగా భూములకు నీరందేలా చర్యలు తీసుకుంది. అయితే ప్రాజెక్టులు పూర్తయ్యాక ఆ నీటితో పంటలు సాగు చేసుకుని, ఈ వ్యయాన్ని తిరిగి చెల్లించేలా షరతులు విధించింది. ఈ వ్యవస్థలతో ఏడాది పాటు భూమి ఖాళీగా లేకుండా పంటలు పండించి, రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందడమే కాకుండా, భూమి నిస్సారం కాకుండా రక్షిస్తున్నారు...

దీనిలో భాగంగా వాసన్ సంస్థ ముందుగా అందుబాటులో ఉన్న నీటి వనరులను గుర్తించి, అక్కణ్ణుంచి నీటిని తోడేందుకు మోటారు ఏర్పాటు చేసింది. ఇక్కడ నుంచి నీటిని సోలార్ విద్యుత్ ద్వారా బయటకు పంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంది. ఈ నీరు నేరుగా పంట భూములకు చేరేలా ప్రత్యేకంగా పైపులైన్లను ఏర్పాటు చేసింది. నీరు అవసరమున్న భూముల్లో మాత్రమే వాడుకునేలా ఎక్కడికక్కడ పాయింట్లను ఏర్పాటు చేసింది. దీని నుంచి 50 ఎకరాలకు మించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంది. ఇలా ఒక్కో ప్రాజెక్టుకు ఎకరానికి రూ. 40వేల చొప్పున సుమారుగా రూ. 20 లక్షల వరకు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించుకుని పంటలు పండించుకున్న రైతులు ప్రాజెక్టుకు అయిన ఖర్చును తిరిగి చెల్లించడంతో పాటు వీరంతా తప్పనిసరిగా ప్రకృతి సాగు చేపట్టాలనే ఒప్పందం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు హుకుంపేట మండలం, పెద్ద గరువు, దుంబ్రిగుడ మండలం గొప్పుల వలస, కరకవలసల్లో ఏర్పాటు వీటిని చేశారు.

ప్రారంభంలో గత ఏడాది హుకుంపేట మండలంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్రాజెక్టు విజయవంతమయ్యింది. పెద్ద గరువులో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు వల్ల మొదటి సంవత్సరమే 15 మంది రైతులు అదనపు ఆదాయం సాధించారు.

పెద్ద గరువుకు చెందిన 22 మంది రైతులు 53 ఎకరాల్లో సాగు చేసేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. దీని నిర్వహణ చూసుకునేందుకు గాను నూకాంబిక నీటిపారుదల సంఘం ఏర్పాటు చేసి, దాని కమిటీకి బాధ్యతలు అప్పగించారు. మొదటి సంవత్సరం కావడంతో 15 మంది ముందుకు వచ్చారు. వీరు ఐదు ఎకరాల్లో ప్రధానంగా కాలిఫ్లవర్, క్యాబేజీ, టమోటా, ముల్లంగి, బజ్జి మిర్చి ఇలా అన్ని రకాల కూరగాయలు, తోటకూర, గోంగూర, కొత్తిమీర వంటి ఆకుకూర రకాలు సాగు చేసి అదనపు ఆదాయం సాధించారు. వీరికి వచ్చిన దిగుబడుల్లో కొంత తమ ఇంటి ఖర్చుకు వినియోగించుకుని, మిగిలిన వాటిని అమ్మకం చేసుకున్నారు. ఈ విధంగా రెండు విధాలుగా ప్రయోజనం చేకూరింది. ఇక్కడ రబీలో సాగు చేసిన రైతులు కొర్రా శాంతమ్మ రూ. 1,000లు, బురిడి గిరిప్రసాదు రూ. 3,400లు, గంజాయి రామ్మూర్తి రూ. 2వేలు, బర్జా లచ్చన్న రూ. 4,350లు, బర్జా హరి రూ. 6,600లు, కిల్లో చిత్రన్న రూ. 8,800లు, కొర్రా రాంబాబు రూ. 3,150లు, పాంగి చిన ముసియన్న రూ. 5,600లు, పాంగి లక్ష్మణరావు రూ. 5,400లు, కిల్లో భగవాన్ రూ. 4,100లు నికర ఆదాయం సాధించారు. మూడో దఫా సాగులో కొర్రా నాగవనమూర్తి రూ. 10,500లు నికర ఆదాయం పొందాడు. కొంతకాలం నుంచి ఖాళీగా ఉండే భూములకు నీరందించడం వల్ల వివిధ పంటలు సాగు చేసి, వారంతా ఇంటి ఖర్చులకు వినియోగించుకోగా, అదనపు ఆదాయం సాధించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీరిని చూసిన మిగిలిన రైతులు వచ్చే సంవత్సరం తమ భూముల్లో సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇదే తరహాలో దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, గొప్పులవలసలో మరో ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న కొండగెడ్డ నుంచి మోటారుతో నీటిని పంపింగ్ చేసి, పెద్ద గరువు మాదిరిగానే పైపుల ద్వారా సాగు భూములకు అందించే విధంగా పాయింట్లు అమర్చారు. దీనికి అవసరమైన విద్యుత్‌ను సోలార్ ద్వారా సమకూర్చే విధంగా పలకలు ఏర్పాటు చేశారు. దీని ద్వారా 26 మంది రైతులు 43 ఎకరాల్లో సాగు చేసేలా ప్రణాళికలు చేశారు. దీని నిర్వహణ బాధ్యత థింసా రైతు ఉత్పత్తిదారుల సంఘ కమిటీకి అప్పగించారు. మొదటి సంవత్సరం కావడంతో 12 మంది రైతులు సుమారుగా ఐదు ఎకరాల్లో గులిరాగితో పాటు వివిధ రకాల కూరగాయల సాగు చేపట్టారు. వీరిలో కొర్రా పండన్న, కొర్రా పోతన్న, కొర్రా అర్జున్, వంతల సండ, కొర్రా లచ్చన్న, పాటి పోతన్న, కొర్రా భగత్ రాం, గంటా ఉస్సు, గంటా బత్తి, గంటా లంబన్న, కిరణకుమార్, గెమ్మిలి భీమన్నలు మొదటి సంవత్సరం సాగు చేశారు. వీటి ఉత్పత్తులను తమ ఇంటి ఖర్చుకు వినియోగించుకోవడమే కాకుండా, అదనపు ఆదాయం సాధించారు. గంటా సోమేశ్వరావు, కొర్రా పండన్నతో పాటు మరో ఇద్దరు రైతుల భూముల్లో సాగు చేసిన పంటల నుంచి ఖరీఫ్‌లోనూ దిగుబడులు వస్తున్నాయి. ఈ విధంగా సాగునీటి వ్యవస్థ ద్వారా లబ్ధిపొందిన రైతులను చూసిన





మిగిలినవారు వచ్చే ఏడాది తాము సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ రెండింటిని స్ఫూర్తిగా తీసుకుని కరకవలస రైతులు ముందుకొచ్చి తమ గ్రామంలోనూ సాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సంస్థ ప్రతినిధులను కోరారు. దీనికి భాగస్వామ్యం చెల్లించేందుకు ముందుకు రావడంతో ఆ గ్రామంలోనూ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు సంకల్పించిన వాసన్ దానికి అనుగుణంగా ప్రణాళికలు చేశారు. మొత్తం 28 రైతులకు చెందిన 48 ఎకరాలకు సాగునీరందించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామానికి దిగువున ఉన్న కొండ గెడ్డ నుంచి నీటిని తీసుకునేలా నిర్ణయించి, అక్కడే మోటారు ఏర్పాటు చేశారు. కాలువను ఆనుకుని ఉన్న రాళ్ల గుట్టపై సోలార్ పలకలు ఉంచి, వాటి నుంచి విద్యుత్ అందేలా చర్యలు తీసుకున్నారు. అక్కడ నుంచి పైపులైను ద్వారా 48 ఎకరాలకు సాగునీరందేలా అవసరమైన చోట్ల పాయింట్లను అమర్చారు. దీనిని ఇటీవలే ప్రారంభించారు. దీనివల్ల అదనపు ఆదాయం సాధించవచ్చని స్థానిక రైతులు భావించి, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రకృతి పద్ధతిలో విస్తీర్ణం పెంచాలంటే అవగాహనతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని వాసన్ సంస్థ భావించింది. దానికి అనుగుణంగా రైతులకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటుకు సంకల్పించింది. దిగువకు వృధాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేయడమే కాకుండా, రైతులకు ప్రయోజనం చేకూరేలా ఈ చర్యలు తీసుకుంది. ముందుగా భారం రైతులపై పడకుండా, నిర్వహణ ఖర్చుల్లేని సోలార్ వ్యవస్థను ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేసింది. ఈ నీటితో రైతులు లబ్ధి పొంది, ఆదాయం సాధించాక, తిరిగి చెల్లించే విధంగా షరతులు విధించింది. దీనికి రైతులు సరే అనడంతో ఒకే ఏడాది రెండు ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో విజయం సాధించారు. ఈ విధంగా మంచి ఫలితాలు రావడంతో నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో విస్తరించేందుకు సంకల్పించింది. దీనివల్ల ప్రకృతి సేద్యం విస్తీర్ణం పెంచడమే కాకుండా, పరోక్షంగా రైతులకు ఇంతవరకు లేని ఆదాయాన్ని సృష్టించే దిశగా ఈ మహాయజ్ఞాన్ని కొనసాగించనుంది.

❀ ❀ ❀ ❀ ❀

“ రంగశీల క్లస్టరు, పెదగరువుకు చెందిన కొర్రా నవగణమూర్తి సోలార్ వ్యవస్థ ద్వారా గత ఏడాది రబీలో 1.13 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగు చేసి రూ. 38,158లు నికర ఆదాయం సాధించాడు. దీనికి కొనసాగింపుగా మూడో పంటగా వేరుశెనగ, జొన్న, ముల్లంగి సాగు చేసి రూ. 10,500ల నికర ఆదాయం పొందాడు. ఈ వ్యవస్థ ద్వారా రబీలో ఖాళీగా ఉండే భూముల్లో అదనపు ఆదాయం సాధిస్తూ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాడు. గతంలో ఎన్నడూలేని విధంగా అదనపు రాబడి సమకూరడంతో కుటుంబ సభ్యులంతా ఆనందిస్తున్నారు. ”



